

ప్రశాంతంగా రైల్వే పోలింగ్

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికలు రెండోరోజు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్ కొనసాగింది. -8లో



ఉపాధ్యాయులకు రక్షణ కల్పించండి

ఉపాధ్యాయుడు ఎజాస్ అహమ్మద్ మృతిపై సమగ్రంగా విచారణ జరిపించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను కోరారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.440	రూ.520
రెండోరకం	రూ.300	రూ.420

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 94 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	585	585
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 188.080 కిలోలు

గురువు లేని చదువులు

❒ మదనపల్లె గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో 130 మంది విద్యార్థులు (3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు) ఉన్నారు. ఈ పాఠశాలలో ఎనిమిది మంది టీజీటీ లు అవుట్‌సోర్సింగ్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్నారు. వీరు ఉద్యమ బాట పట్టారు. ప్రస్తుతం గురుకులంలో చదువు చెప్పేవారు లేక బోధన కుంటుపడింది.

❒ తంబళ్లపల్లె గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో 80 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలలో ఆరు మంది టీజీటీలు అవుట్ సోర్సింగ్ పద్ధతిన విధులు నిర్వహిస్తురు. వీరు ఉద్యమబాట పట్టారు. ప్రస్తుతం గురుకులంలో ప్రిన్సిపాల్ ఒక్కరే అన్ని సబ్జెక్టులు బోధిస్తున్నారు.

- సమ్మెబాటలో గురుకులాల అవుట్‌సోర్సింగ్ టీచర్లు
- గత నెల 27 నుంచి విధులకు గైర్హాజరు
- జిల్లాలో ఏడు గురుకులాల్లో సబ్జెక్టు టీచర్ల కొరత



తంబళ్లపల్లె గిరిజన గురుకులంలో బోధన చేస్తున్న ప్రిన్సిపాల్

మదనపల్లె సిటీ: ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ పెద్దలను వేడుకున్నా వారు కనికరించలేదు. దీంతో గురుకులాల గురువులు సమ్మె బాట పట్టారు. జిల్లాలో ఏడు ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో శాంక్షన్ పోస్టులు లేకపోవడంతో 90 శాతానికి పైగా అవుట్ సోర్సింగ్ టీచర్లు బోధిస్తున్నారు. వీరంతా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత నెల 27వ తేదీ నుంచి ఉద్యమ బాట పట్టారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న మెగా డీఎస్సీ నుంచి గురుకులాల్లోని ఔట్ సోర్సింగ్ పోస్టులను మినహాయించాలని, చాలీచాలనీ వేతనాలతో జీవితాలను సాగిస్తున్న తమను కాంట్రాక్టు రెగ్యులర్ టీచర్స్ (సీఆర్‌టీ)లుగా పరిగణించాలని వారు సమ్మె చేస్తున్నారు. సమస్యను అర్థం చేసుకుని సకాలంలో పరిష్కరించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

అటకెక్కిన బోధన

గిరిజన గురుకులాల్లో టీచర్లు లేకపోవడంతో విద్యాబోధన అటకెక్కింది. జిల్లాలోని ఏడు గిరిజన గురుకులాల్లో 3 నుంచి 10వ తరగతి వరకు దాదాపు 1270 మంది విద్యార్థులున్నారు. ఆయా పాఠశాలల్లో ఒకరిద్దరు మినహా మిగిలిన టీచర్లు సమ్మెలో ఉన్నారు.మరో మూడు నెలల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పలువురు విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

ఐఎఫ్‌సీ ద్వారా కొనసాగుతున్న బోధన

ప్రభుత్వ పాఠశాలల్లో కూడా కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్యాబోధన అందించాలనే సదుద్దేశంతో నాడు-నేడు కింద వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రతి స్కూల్‌కు రూ.లక్ష వెచ్చించి ఐఎఫ్‌ఎల్ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్స్) సిస్టమ్స్‌ను సమకూర్చారు. ప్రస్తుతం ప్రిన్సిపాల్, ఒకరిద్దరు రెగ్యులర్ టీచర్లు బోధన కొనసాగిస్తున్నారు.

జిల్లాలో గిరిజన సంక్షేమ గురుకులాలు

మండలం	విద్యార్థులు	సమ్మెలో ఉన్న టీజీలు
మదనపల్లె	130	8
తంబళ్లపల్లె	80	6
పీలేరు	100	8
కె.వి.పల్లి	200	11
రాయచోటి	230	6
రాయచోటి	400	21
సుండుపల్లె	130	8



మదనపల్లెలోని బాలుర గిరిజన గురుకుల విద్యాలయం

శ్రమను గుర్తించాలి



తక్కువ వేతనంతో గురుకులాల్లో ఏళ్లుగా పని చేస్తున్నాం. సీఆర్‌టీలుగా పరిగణించి డీఎస్సీలో తాము న్న స్థానాలను మినహాయించాలి. 2022 పీఆర్‌సీ ప్రకారం వేతనాలు పెంచాలి. ప్రస్తుతం టీజీటీలకు రూ12,900, ఆర్ట్, క్రాఫ్ట్, పీఈటీలకు రూ.9,500 చెల్లిస్తున్నారు. చాలీచాలనీ జీతాలతో గడుపుతున్నాం. ప్రభుత్వం స్పందించి మా సమస్యలు పరిష్కరించాలి. -బి.శ్రీనివాసులునాయక్, ఏపి ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ టీచర్స్,లెక్చరర్స్ యూనియన్ ఉమ్మడి జిల్లా సలహాదారులు

చదువులకు భంగం



టీచర్లు లేకపోవడంతో మా చదువులకు భంగం కలుగుతుంది. టీచర్లు మాకు రోజు పాఠాలు బాగా చెప్పేవారు. సమ్మెకు వెళ్లడంతో చదువుకోవాలంటే కష్టంగా ఉంది. -రామచంద్రనాయక్, పదోతరగతి విద్యార్థి, గిరిజన గురుకుల విద్యాలయం, తంబళ్లపల్లె

ప్రిన్సిపాల్ మేడమే పాఠాలు చెబుతున్నారు



టీచర్లు సమ్మె చేస్తుండటంతో ప్రిన్సిపాల్ మేడమే పాఠాలు చెబుతున్నారు. ఉపాధ్యాయులు లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. విద్యాశాఖ అధికారులు స్పందించాలి. -నాగేంద్రనాయక్, పదోతరగతి విద్యార్థి, గిరిజన గురుకుల విద్యాలయం, తంబళ్లపల్లె

నేటి నుంచి ఆకేపాటి పాదయాత్ర

- 'అన్నమయ్య కాలిబాట' ద్వారా తిరుమలకు...



ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

రాజంపేట: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమరనాథరెడ్డి శుక్రవారం నుంచి నాలుగురోజుల పాటు అన్నమయ్యకాలిబాటలో 22వ తిరుమల మహాపాదయాత్రను చేపట్టనున్నారు. ఈనేపథ్యంలో ఆకేపాడు ఆలయాల సముదాయంలోని టీటీడీ కల్యాణమండపంలో శ్రీవారికళ్యాణం అనంతరం పాదయాత్రను ఆకేపాటి చేపట్టనున్నారు. ఈనెల 9న ఉదయం జిల్లా సరిహద్దులో ఉన్న కుక్కలదొడ్డి నుంచి దట్టమైన శేషాచలం అటవీ ప్రాంతంలోకి పాదయాత్ర ప్రవేశిస్తుంది.సాయంత్రం 4గంటలకు తిరుమలకొండకు చేరుకోనున్నది. ఆకేపాటి ఆధ్వర్యంలో గోవిందమాల ధరించిన భక్తులు శ్రీవారిని దర్శించుకోనున్నారు.

పాదయాత్ర ఇలా..

తిరుమల మహాపాదయాత్ర సాయంత్రం 5గంటలకు రాజంపేట పట్టణ శివార్లలోని మన్నూరు యల్లమ్మ గుడివద్దకు చేరుకుంటుంది. రాత్రి 7 గంటలకు ఎస్‌ఆర్ కల్యాణమండపంలో బస చేయనున్నారు. 7న ఉదయం 5గంటలకు బయలుదేరే పాదయాత్ర 8గంటలకు పుల్లంపేట మండలం అనంతంపల్లె, మధ్యాహ్నం 12 గంటలకు ఓబులవారిపల్లె మండలం ముక్కవారిపల్లె జెడ్పీహైస్కూల్, సాయంత్రం 7గంటలకు రైల్వేకోడూరు మండలం అనంతరాజంపేటకు చేరుకుంటారు. ఉదయం 5గంటలకు బయలుదేరి, 8 గంటలకు రైల్వేకోడూరు, శెట్టిగుంట, రాత్రి 7గంటలకు కుక్కలదొడ్డి చేరుకుంటారు.. 9గంటలకు 6గంటలకు శేషాచలం అటవీ మార్గంలో తిరుమల కొండకు బయలుదేరుతారు. సాయంత్రం 4గంటలకు కొండపైకి చేరుకోనున్నారు.

న్యూస్‌రీల్

పెద్దదర్గా సన్నిధిలో సినీ నటి మీనాక్షి చౌదరి



పెద్దదర్గాలో మీనాక్షి చౌదరి

కడప కల్చరల్: యువ సినీ నటి మీనాక్షి చౌదరి గురువారం కడప నగరంలోని ప్రముఖ సూఫీ క్షేత్రమైన పెద్దదర్గాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు దర్గా ప్రతినిధులు స్వాగతం పలికారు. అక్కడి ప్రధాన గురువుల మజార్‌ను ఆమె దర్శించుకున్నారు. ఆ ప్రాంతం గురించి స్వయంగా దర్గా ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ దర్గాను దర్శించుకోవాలన్న ఆశ నేటికీ వేరిందని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి (జగదాంబసెంటర్): జిల్లాలోని సమగ్ర శిక్ష ప్రాజెక్టు ఆఫీస్‌లో ఫారిన్ సర్వీస్ నిబంధనలు, షరతులపై పలు పోస్టుల్లో పని చేసేందుకు జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. సహాయ ప్రత్యామ్నాయ పాఠశాల సమన్వయర్త (అసిస్టెంట్ ఏఎల్‌ఎస్‌సీవో) కోసం స్కూల్ అసిస్టెంట్‌గా ఐదు సంవత్సరాలు పని చేసి ఉండాలి. అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్(ఏపీఓ) పోస్టుకు స్కూల్ అసిస్టెంట్ క్యాడర్‌లో ఐదు సంవత్సరాలు సర్వీస్ కలిగి ఉండాలి. మాథ్స్ కంప్యూటర్ సైన్స్ ఎంసీఏలో పీజీ డిగ్రీ ఉండాలన్నారు. అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్(ఏఎస్ఓ) పోస్టుకు స్కూల్ అసిస్టెంట్ క్యాడర్‌లో ఐదు సంవత్సరాలు సర్వీస్ కలిగి మాథ్స్/స్టాటిస్టిక్స్‌లో పీజీ డిగ్రీ, గుర్తింపు పొందిన యూనివర్సిటీలో కంప్యూటర్ డిప్లమో/డిగ్రీ కలిగి ఉండాలన్నారు. ఈ నెల 12వ తేదీ లోగా సంబంధిత ప్రధానోపాధ్యాయుని ద్వారా జిల్లా ప్రాజెక్టు అధికారి, సమగ్ర శిక్ష, రాయచోటి కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని డీఈఓ తెలిపారు.

ఉపాధ్యాయుని మృతి ఘటనపై విచారణ

రాయచోటి: రాయచోటి పట్టణం కొత్తపల్లెలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు ఎజాస్ అహమ్మద్ మృతిపై ఆర్జేడీ శామ్యూల్ ఆధ్వర్యంలో విచారణ జరిగింది. గురువారం కమిటీ సభ్యులు డీఈవో సుబ్రహ్మణ్యం, డిప్యూటీ ఈవో శివప్రకాష్‌రెడ్డి, ఎంఈవో నాయక్‌లు పాఠశాలలో విచారణ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది నుంచి వేర్వేరుగా విచారణను చేపట్టారు. వారందించిన సమాచారం ఆధారంగా కమిటీ సభ్యులు, డీఈవో, డిప్యూటీ డీఈవోలు నివేదికను రూపొందించి గురువారం రాత్రి ఆర్జేడీకి అందజేశారు. నివేదిక ఆధారంగా సంఘటనకు బాధ్యులైన వారిని, నిర్లక్ష్యం వహించిన ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకొంటామని ఆర్జేడీ మీడియాకు తెలిపారు.

రాష్ట్రంలో అధ్వానంగా సంక్షేమ హాస్టళ్లు



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌యూ నాయకులు

రాజంపేట టౌన్: రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లు అధ్వానంగా ఉన్నాయని ఆర్‌ఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు వెనుతుర్ల రవిశంకర్‌రెడ్డి దుయ్యబట్టారు. రాజంపేటలోని జీఎంసీ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన ఆర్‌ఎస్‌యూ మూడో జిల్లా మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం సంక్షేమ హాస్టల్స్‌పై దృష్టిసారించకుంటే భవిష్యత్తులో ఇవి మూతపడతాయని, పేద విద్యార్థులు విద్యకు దూరం అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందన్నారు. తొలుత ఆర్‌ఎస్‌యూ నాయకులు, విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానం నుంచి జీఎంసీ కల్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్, జిల్లా నాయకులు వంశీ, కొండేటి హరిబాబు, వెంకటేష్‌నాయక్, ఘధు, సుకుమార్, ప్రమోద్, కిరణ్,ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ప్రతినిధులు రాఘవరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, గీతాంజలి రమణ, ఏ.ప్రభాకర్‌నాయుడు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులపై అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి: రెవెన్యూ సదస్సులపై ప్రజలకు అవగాహన కల్పించి సదస్సులను విజయవంతమయ్యేలా చూడాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో డిసెంబర్ 6 నుంచి జనవరి 18వ తేదీ వరకు జిల్లాలో జరిగే రెవెన్యూ సదస్సులపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని 501 గ్రామ పంచాయతీల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఇన్‌కమ్ సర్టిఫికెట్, మ్యుటేషన్ లాంటి రెవెన్యూ సేవలకు సదస్సు నిర్వహించబోయే రోజు ఆయా రెవెన్యూ సేవలు ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు. సమావేశంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి ప్రతినిధి రవీంద్రారెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షులు జగన్ మోహన్ రాజు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌ఓ మధుసూదన్ రావు పాల్గొన్నారు.

పిజీఆర్‌ఎస్ ద్వారా అత్యధిక అర్జీలు రెవెన్యూ సమస్యలు

ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో 85శాతం రెవెన్యూ సమస్యలే ఉన్నాయన్నారు. గ్రామంలో ఏరోజు సదస్సు నిర్వహిస్తారో పత్రికా ప్రకటనలు ద్వారా, ఇతర మాధ్యమాల ద్వారా ప్రజలందరికీ తెలియజేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 30 మండలాలలకు 30 మంది జిల్లా అధికారులను, నోడల్ అధికారులుగా నియమించామన్నారు. ఆర్డీఓలు, సబ్ కలెక్టర్లు, ప్రత్యేక అధికారులుగా ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అడిషనల్ నోడల్ ఆఫీసర్లుగా పనిచేయబోతున్నారని ఆయన పేర్కొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి: సబ్‌కలెక్టర్

నిమ్మనపల్లె: క్షేత్రస్థాయిలో నిర్వహించే రెవెన్యూ గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్, సర్వేయర్, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ ధనంజయులు నుంచి రెవెన్యూ రికార్డుల నిర్వహణపై, ప్రజల సమస్యల పరిష్కారంకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. రెవెన్యూ సమస్యలపై ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ రికార్డుల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.

వంద గ్రామాల్లో ఫెంగల్ ప్రభావం

- 1,098 హెక్టార్లలో పంటకు నష్టం



బి.కొత్తకోటలో నేలకొరిగిన కోతకొచ్చిన వరి పంట

బి.కొత్తకోట: ఫెంగల్ తుపాను ప్రభావం జిల్లాలోని 14 మండలాల్లో చూపింది. ఈ మండలాల్లోని వంద గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలపై ప్రభావం చూపింది. వరి పంటపైనే అధిక ప్రభావం చూపించగా రైతులకు రూ.1.80 కోట్ల నష్టం వాటిల్లిందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించారు. వంద గ్రామాల్లో 2,560 రైతులు మంది తమ పంటలను నష్టపోయారు. మొత్తం 1,098.3 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లగా అందులో వరి 1,078.3 హెక్టార్లలో, మొక్కజొన్న 20 హెక్టార్లలో నష్టం జరిగింది. ఈ పంటలు కోత దశలో ఉండగా నష్టం వాటిల్లినట్టు వ్యవసాయశాఖ గుర్తించింది.

పంట నష్టం వివరాలు

మండలం	గ్రామాలు	రైతులు	హెక్టార్లు
గుర్రంకొండ	10	185	76
మదనపల్లె	14	876	324
నిమ్మనపల్లె	10	623	256
కురబలకోట	06	90	65
రామసముద్రం	14	132	32
బి.కొత్తకోట	12	278	170
తంబళ్లపల్లె	09	126	78.9
రామాపురం	06	37	27
పీలేరు	02	03	01
కేవిపల్లె	01	02	01
చిన్నమండెం	11	112	22.4
సంబేపల్లె	02	90	36.6
రాయచోటి	01	01	0.4
వాల్మీకిపురం	02	05	02

పుష్ప.. వైల్డ్ ఫైర్..

- అదరగొడుతున్న పుష్ప-2 డైలాగులు
- సుకుమార్ దర్శకత్వంలో ప్రేక్షకులకు ప్రత్యేక కిక్కు
- సినిమా విడుదల నేపథ్యంలో ఎక్కడ చూసినా రచ్చరచ్చ



మదనపల్లెలోని పుష్ప-2 సినిమా ప్రదర్శించే థియేటర్ వద్ద ప్రేక్షకుల సందడి



సాక్షి రాయచోటి: పుష్ప ది రూల్ ఆధారంగా దర్శకుడు సుకుమార్ తెరకెక్కించిన చిత్రం పుష్ప-2. ఏళ్ల తరబడి షూటింగ్ చేసి చిత్ర నిర్మాణంలో ప్రత్యేక ఫైర్ తీసుకు రావడంతో ప్రేక్షకులు కిక్కు ఎక్కిస్తోంది. పుష్ప-1 చిత్రంలో తగ్గేదెలా డైలాగ్‌కు ఎంత పాపులారిటీ వచ్చిందో పుష్ప-2లో కూడా ఒకటి, రెండు కాదు... అనేక డైలాగులకు థియేటర్లు దద్దరిల్లిపోతున్నాయి. చిత్రంలో పుష్ప (యువ హీరో అల్లు అర్జున్), భార్యగా నటించిన శ్రీవల్లి (రష్మికా మండాన) మధ్య కథ ఆకట్టుకుంది. చిత్రంలో విలన్, పోలీసులు, ఇతర నటులు కూడా జీవం పోశారు. పెద్ద బడ్జెట్‌తో ప్రపంచ వ్యాప్తంగా గురువారం విడుదలైన పుష్ప-2 అంచనాలకు మించి భారీ విజయం దిశగా దూసుకుపోతోంది. ఎక్కడ చూసినా అన్నిచోట్ల ఒకటే పాజిటివ్ టాక్ నడుస్తోంది.

అదరగొడుతున్న పాటలు

పుష్ప-2 చిత్రంలో ఉన్న కొన్ని పాటలు కూడా ఉర్రూతలూగిస్తున్నాయి. సంగీత మాంత్రికుడు దేవిశ్రీ ప్రసాద్ ప్రేక్షకులను తన సంగీతంతో థియేటర్లలో మంత్ర ముగ్ధుల్ని చేశాడు. పుష్ప...పుష్ప...పుష్ప...డ్యాన్స్...నువ్వు ముందుకు నడిచి వస్తుంటే భూమి దద్దరిల్లే పాట, అరెయ్...అందరూ వచ్చిండ్రారుగానీ పార్టీకి...ఇప్పుడు దించరా ఫోటో కిసిక్కుమని...కిస్‌కిస్ కిసుక్కుమని..కిస్సాకిస్సా...దెబ్బలు పడతాయ్ రోవ్ అనే పాటలు ఆకట్టుకున్నాయి. పుష్ప-2 సినిమాలో డైలాగులు అదిరిపోయేలా రూపొందించారు. మ్యూజిక్‌తో పాటు డైలాగులు, పాటలు, కథ, గ్రాఫిక్స్ ఇలా ఒకరినొకరు పోటీపడి వారి నైపుణ్యాన్ని చూపించారు.

ఎర్రచందనం ఆధారంగా.....

అన్నమయ్య జిల్లా ఎర్రచందనానికి ప్రసిద్ధి. 5.45 లక్షల హెక్టార్లకు పైగా అటవీ విస్తీర్ణం ఉండగా, అందులో 90 వేల హెక్టార్లకు పైగా ఎర్రచందనం విస్తరించి ఉంది. ప్రధానంగా నల్లమల, శేషాచలం, ఎర్రమల, లంకమల అడవుల్లో ఎర్రచందనం విస్తారంగా ఉంది. పుష్ప-1 సినిమా ఎర్రచందనం అక్రమ రవాణా ఆధారంగా రూపుదిద్దుకుంది. దీంతో జిల్లాకు సంబంధించి ఎర్రచందనానికి, సినిమాకు ముడిపడిన నేపథ్యంలో జనాలు కూడా పుష్ప-2 కూడా ఎలా తీశారోనని ఆసక్తి చూపుతున్నారు.

జిల్లాలోని థియేటర్లలో పుష్ప-2 సందడి

అన్నమయ్య జిల్లాలో పుష్ప-2 సందడి కనిపిస్తోంది. జిల్లాలోని ప్రముఖ పట్టణమైన మదనపల్లెలోని ఏడు థియేటర్లలో పుష్ప-2 అలరిస్తోంది. పవన్ కల్యాణ్‌కు సంబంధించిన జనసేన పార్టీ నాయకులు వచ్చి జై పవన్ కల్యాణ్ అంటూ అల్లు అర్జున్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలాగే రైల్వేకోడూరు, రాయచోటి, రాజంపేటలలో మూడు థియేటర్లలో సినిమా ప్రదర్శిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా గురువారం పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా థియేటర్ల వద్ద అల్లు అర్జున్ అభిమానులు కటౌట్లకు పూలమాలలు వేసి పాలాభిషేకం చేశారు. ఎక్కడ చూసినా సందడి వాతావరణం కనిపించింది.

ఊహకు అందని రీతిలో ఉంది



పుష్ప సినిమా ఊహకు అందని రీతిలో ఉంది. ఊహాజనితంగా తీసిన ఈ సినిమా సగటు ప్రేక్షకుడిని అలరించింది. హీరో అల్లు అర్జున్, హీరోయిన్ రష్మిక నటన సూపర్. పుష్ప సినిమా మంచి వసూళ్లు సాధించి అంతర్జాతీయ స్థాయిలో మన సత్తా చాటాలి. - కె.చిన్నరెడ్డయ్యరాజు, ఎస్‌ఎన్ కాలనీ, రాయచోటి

అల్లు అర్జున్ నటన అదుర్స్



పుష్ప మూవీలో అల్లుఅర్జున్ నటన అదుర్స్. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆలరించే సన్నివేశాలు ఉన్నాయి. అల్లుఅర్జున్ డ్యాన్స్‌తో ప్రేక్షకులను అలరింపచేశారు. తెలుగు సినీ ఖ్యాతిని పుష్ప-2తో అందనంత ఎత్తుకు తీసుకెళ్లాడు. -తంబెళ నరసింహారెడ్డి, మందరం, రాజంపేట మండలం

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి



మృతి చెందిన బినాతి మోహన్

రామాపురం : మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కొత్తపల్లికి చెందిన బినాతి మోహన్(48) గురువారం తెల్లవారుజామున విద్యుత్ తీగలు తగిలి మృతి చెందినట్లు మండల ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు కొత్తపల్లి గ్రామానికి చెందిన బినాతి మోహన్ గ్రామ శివారులోని వరి పంట పొలాలకు మోటార్ స్విచ్ ఆన్ చేసేందుకు వెళ్లాడు. అక్కడే కింద పడి ఉన్న విద్యుత్ తీగలను గమనించక తీగలను తొక్కడంతో అతను షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేవీపల్లె వాసి కువైట్‌లో మృతి



పెంచలయ్య మృతదేహం

కేవీపల్లె : కేవీపల్లె మండలానికి చెందిన ఓ వ్యక్తి కువైట్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ వంకాటవారిపల్లెకు చెందిన పెంచలయ్య (54) తన భార్యతోపాటు బతుకుదెరువు కోసం 20 ఏళ్ల క్రితం కువైట్‌కు వెళ్లాడు. గత నెల 30న పెంచలయ్య గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఆయన మృతదేహం గురువారం స్వగ్రామానికి చేరుకుంది. మృతునికి ఇద్దరు కుమారులున్నారు.

మానవత్వం మంట కలిసిన వేళ!

- తోటి ఉపాధ్యాయునిపై దాడి జరుగుతున్నా అడ్డుకోని ఉపాధ్యాయులు
- గుండెపోటుతో మృతి చెందాడంటూ ప్రచారంపై మండిపాటు
- నిందితులను కఠినంగా శిక్షించాలని కలెక్టర్, ఎస్పీలకు విన్నపం



ఎజాస్ అహ్మద్ (ఫైల్)



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ ఐక్య వేదిక నాయకులు

రాయచోటి : నేటి సమాజంలో తల్లి, తండ్రి, గురువు, దైవం అన్న మాటలకు నీళ్లొదిలారు. రోజురోజుకు సమాజంలో జరుగుతున్న దారుణాలు సభ్య సమాజంలో మానవ విలువల పతనానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. తల్లిదండ్రుల మాటకు విలువ ఇచ్చి, గురువులను గౌరవించి క్రమశిక్షణతో విద్యనభ్యసించాల్సిన విద్యార్థులు పెడతోవ పడుతున్నారు. మద్యం, గంజాయి లాంటి వ్యసనాలకు బానిసలై పైశాచిక చర్యలకు పాల్పడుతుండటం ఆందోళన కలిగిస్తున్న పరిణామం.

అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఉపాధ్యాయుడిపై కిరాతకంగా దాడికి తెగబడిన హేయమైన ఘటన యావత్ లోకాన్ని సిగ్గుపడేలా చేసింది. ఇద్దరు విద్యార్థులు సాటి విద్యార్థిని కొడుతుంటే వారించిన ఉపాధ్యాయుడిని అదే విద్యార్థులు కలిసి కొట్టి చంపిన దుర్మార్గ ఘటన సమాజాన్ని కలవరపెడుతోంది. ఈ దారుణానికి కారణం పిల్లలను క్రమశిక్షణలో పెంచని తల్లిదండ్రులా? లేక వారి చుట్టూ ఉన్న పరిస్థితులా? లేక చదువులు నేర్పే గురువుల లోపమా అనేది ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

సినిమా స్టైల్‌లో దాడి

రాయచోటి పట్టణం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి గదిలో ఘర్షణ పడుతున్న ఇద్దరు విద్యార్థులను ఎజాస్ అహమ్మద్ గట్టిగా మందలించారు. ఉపాధ్యాయుడి మందలింపుతో కోపోద్రిక్తుడైన ఒక విద్యార్థి ఇంటి దగ్గర ఉన్న సోదరుడికి సమాచారం చేరవేశాడు. ఆ యువకుడు తన మిత్రునితో కలిసి పాఠశాలలోని తరగతి గదిలోకి చేరుకుని ఉపాధ్యాయుడిపై పిడిగుద్దులు గుద్దుతూ, కాళ్లతో తన్నుతూ, ముంజేతికి ధరించిన కడియాలను పిడికిలిలో పట్టి దాడి చేసిన ఘటన అచ్చం సినిమాలో హీరో ఫైట్లను తలపించాయని విద్యార్థులు చెబుతున్నారు. మృతుని శరీరంపై కనిపిస్తున్న గాయాలను చూసి ఉపాధ్యాయుడి భార్య తన భర్తను కొట్టి చంపారంటూ కన్నీటి పర్యంతమైంది. జరిగిన సంఘటనను తనకు చెప్పకపోగా, దాడి చేసిన వారికి తోటి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడు మద్దతు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తన భర్త ఆరోగ్యం గురించి తనకు తెలుసని, గుండెపోటుతో మరణించే ప్రసక్తే లేదని విలపించింది.

మానవత్వాన్ని మరిచిన తోటి ఉపాధ్యాయులు

400 మంది విద్యార్థులు, 20 మందికిపైగా ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది ఉన్న పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడిపై ముగ్గురు యువకులు కిరాతకంగా దాడి చేసిన సంఘటన కళ్ల ఎదుట కనిపిస్తున్నా.. వారిని వారించే విషయంలో కానీ, తోటి ఉపాధ్యాయునికి తోడుగా నిలవడానికి ఒక్కరంటే ఒక్క ఉపాధ్యాయుడు, ప్రధానోపాధ్యాయుడు ముందుకు రాకపోవడం మానవతా విలువలను మంటగలిపేలా చేసింది. సంఘటన జరిగిన తర్వాత అయినా యదార్థ సంఘటనను కుటుంబ సభ్యులకు, ఉన్నతాధికారులకు తెలియజేయాలన్న ఇంగిత జ్ఞానం కూడా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, తోటి ఉపాధ్యాయులు, సిబ్బందికి లేకపోవడం సిగ్గుచేటు. సంఘటనపై జిల్లా కలెక్టర్, పోలీస్ అధికారులు, మీడియా ప్రతినిధులు వాస్తవాల కోసం పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని ప్రశ్నించినా ఉపాధ్యాయునిపై జరిగిన దారుణ సంఘటనను మరుగున పెట్టి గుండెపోటుతో మృతి చెందినట్లు పదేపదే చెప్పడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

అనుమానాలెన్నో..

సౌమ్యుడు, ఉత్తమ ఉపాధ్యాయుడుగా పేరున్న ఎజాస్ అహ్మద్ మరణంపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ముగ్గురు విద్యార్థులు కలిసి ఉపాధ్యాయునిపై దాడి చేస్తున్నా తోటి ఉపాధ్యాయులు ఎందుకు అడ్డుకోలేదు.. సంఘటన జరిగిన తర్వాత విద్యార్థుల పేర్లను ఎందుకు బయటపెట్టలేదు.. గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలించామని పదే పదే ప్రధానోపాధ్యాయుడు చెబుతుండడం వెనుక ఎవరి హస్తం ఉందన్న అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి.

కఠిన చర్యలు తీసుకోవాలి

ఉపాధ్యాయుని మృతికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా పరిధిలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడులను కలిసి విన్నవించారు. తోటి ఉపాధ్యాయుడి చావుకు కారణమైన ప్రధానోపాధ్యాయుడు, తోటి ఉపాధ్యాయులను సస్పెండ్ చేసి శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

అన్ని కోణాల్లో విచారిస్తున్నాం

పాఠశాలలో ఉపాధ్యాయుడు ఎజాస్ అహ్మద్ మృతి పట్ల అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నట్లు రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు. భార్య రెహిమూన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దాడి చేసిన వారిని, పాఠశాలలో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడు, సిబ్బందిని విచారణ చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు.

ఉపాధ్యాయుల నిరసన

పెనగలూరు : విద్యార్థుల దాడిలో ఉపాధ్యాయుడు మృతి చెందడం పట్ల మండలంలోని చక్రంపేట జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయుని కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు బి.హరిప్రసాద్, అన్వర్ బాషా, సుదర్శన్, మహేంద్ర, శివ, నరసింహులు, కృష్ణకుమారి, ప్రమీల, శ్రీవాణి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు రక్షణ కల్పించండి



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

రాయచోటి అర్బన్ : తమకు రక్షణ కల్పించాలని ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులు జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. గురువారం అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఐక్య వేదికగా ఏర్పడి కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను కలిసి ఉపాధ్యాయుడు ఎజాస్ అహమ్మద్ మృతిపై సమగ్రంగా విచారణ జరిపించాలని కోరారు. కొత్తపల్లె జెడ్పీ ఉర్దూ హైస్కూల్‌లో సత్ ప్రవర్తన లేని కొందరు విద్యార్థులను ఉపాధ్యాయుడు ఎజాస్ అహమ్మద్ మందలించాడన్నారు. ఇందుకు ఆగ్రహించిన విద్యార్థులు తరగతి గదిలోనే గురువుపై అతి కిరాతకంగా దాడిచేసి కొట్టి హత్యచేయడం సభ్యసమాజం సిగ్గుపడాల్సిన అంశమన్నారు. కలెక్టర్ స్పందిస్తూ సంఘటనపై విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని హామీ యిచ్చారు. ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులు శివారెడ్డి, జాబీర్, రెడ్డెప్పరెడ్డి, హరిబాబు, సిబాతుర్ రహిమాన్, జక్రియా, మున్వర్ బాషా, ఇలియాస్, రామాంజనేయులు, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబానికి న్యాయం చేయాలి

ఉపాధ్యాయుడు ఎజాస్ అహమ్మద్ కుటుంబానికి ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం ఉపాధ్యాయ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎజాస్ అహమ్మద్ మృతికి నిరసనగా ర్యాలీ నిర్వహించారు. సెల్‌ఫోన్‌లలోని టార్చ్‌లైట్లను వెలిగిస్తూ ర్యాలీ కొనసాగింది.

ఉపాధ్యాయుడి మృతి విచారకరం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి



ఎజాస్ అహ్మద్ భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తున్న గడికోట శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : రాయచోటి పట్టణం కొత్తపల్లె ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు ఏజియాస్ అహమ్మద్ మృతి విచారకరమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాయచోటిలో పార్టీ కార్యాలయం నుంచి విడుదలైన ప్రకటనలో విద్యార్థుల దాడిలో ఉపాధ్యాయుడు మృతి చెందారన్న విషయం కలచివేసిందన్నారు. పాఠశాలలో ఈ సంఘటన ఎలా జరిగింది, ఏమి జరిగింది, గత కొద్ది రోజులుగా ఏమి జరుగుతుందో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. స్థానిక ప్రధానోపాధ్యాయుడు, పోలీసులపై ప్రజలకు వాస్తవాలను తెలియపరచాల్సిన బాధ్యత ఉందన్నారు. గురువారం సాయంత్రం కడప నగరం కాగితాలపెంటలోని వారి నివాసంలో ఉంచిన ఉపాధ్యాయుడు ఎజాస్ అహమ్మద్ భౌతిక కాయాన్ని శ్రీకాంత్ రెడ్డి సందర్శించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి

మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి



రాయచోటి : ఉపాధ్యాయుడు ఏజియాస్ అహమ్మద్ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం రాయచోటిలో పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో ఉపాధ్యాయులపై జరుగుతున్న దాడులపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జరిగిన సంఘటనపై ఉన్నతస్థాయి అధికారుల ఆధ్వర్యంలో పారదర్శకంగా విచారణ చేపట్టి నిజానిజాలను వెలుగులోకి తేవాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

స్వామి పడిమెట్ల లడ్డు, వెండి మాలలు వేలం



లడ్డును దక్కించుకున్న సిద్దు కుటుంబ సభ్యులు

మదనపల్లి సిటీ : స్థానిక అయ్యప్పనగర్‌లో వెలసిన శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో జరిగిన పడిపూజ కార్యక్రమంలో పడిమెట్ల లడ్డూలు, స్వామివారి వెండితో కూడిన తులసి, రుద్రాక్షమాల వేలం పాట నిర్వహించారు. 18వ పడిమెట్టుపై ఉన్న వెండి రుద్రాక్ష, లడ్డూను నీరుగట్టువారిపల్లెకు చెందిన విష్ణు ఎంటర్ ప్రైజస్ యజమాని సిద్దు రూ.1,26,000 దక్కించుకున్నారు. దీంతో పాటు మరో మూడు లడ్డూలకు కూడా వేలం నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు మార్పూరి సుధాకర్ నాయుడు, మార్పూరి వరుణ్ రూ.లక్ష విరాళం ప్రకటించారు.

కువైట్ నుంచి స్వగ్రామం చేరిన మృతదేహం



ఆజాద్ బేగ్ మృతదేహం

ములకలచెరువు : మండలంలోని చౌడసముద్రానికి చెందిన ఎస్.ఆజాద్‌బేగ్(45) అనారోగ్యంతో కువైట్‌లో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు... బతుకుతెరువు కోసం రెండేళ్ల క్రితం ఆజాద్ బేగ్ కువైట్ వెళ్లాడు. ఇతనికి భార్య మక్బూల్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అక్కడ సంపాదించిన సొమ్ముతో కుటుంబం పోషించుకుంటూ పిల్లలను చదివించుకుంటున్నారు. ఈ నెల రెండో తేదీ అనారోగ్యం కారణంగా అక్కడి ఆసుపత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహం కువైట్ నుంచి గురువారం స్వగ్రామం చేరుకుంది. ఆజాద్ బేగ్ మృతితో చౌడసముద్రంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. భార్య, పిల్లల రోదన ప్రతి ఒక్కరినీ కంట తడిపెట్టించింది.

భార్యపై భర్త దాడి



గాయపడిన రాధమ్మ

కురబలకోట : మండలంలోని మండ్యంవారిపల్లెలో రాధమ్మ (42)పై ఆమె భర్త శివయ్య బుధవారం అర్ధరాత్రి దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ముదివేడు పోలీసుల కథనం మేరకు..మండ్యంవారిపల్లెకు చెందిన శివయ్య మద్యం మత్తులో అర్ధరాత్రి వేళ ఇంటికి చేరాడు. కుటుంబీకులు మందలించారు. కోపగించిన ఆయన భార్య రాధమ్మపై విచక్షణా రహితంగా కర్రతో దాడి చేశాడు. అడ్డు వచ్చిన తల్లి ఈశ్వరమ్మను కూడా గాయపరిచాడు. గాయపడిన వారిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏడుగురు లాటరీ టికెట్ల విక్రేతలు బైండోవర్



తహసీల్దార్ భీమేశ్వర్‌రావు ముందు బైండోవర్ అయిన లాటరీ టికెట్ల విక్రేతలు

పీలేరురూరల్ : ఏడుగురు లాటరీ టికెట్ల విక్రేతలను బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు. పీలేరు పట్టణంలోని క్రాస్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో లాటరీ టికెట్లు విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 53,750 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తహసీల్దార్ భీమేశ్వర్‌రావు ఎదుట బైండోవర్ చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశామన్నారు.

ఎర్ర చందనం స్మగ్లర్ అరెస్టు

గౌరిబిదనూరు : ఓ వాహనం చోరీ కేసులో తీగ లాగితే ఎర్ర చందనం స్మగ్లర్ చిక్కాడు. బెంగళూరు వద్ద చిక్కబళ్లాపురంలో కారు పార్కింగ్ నుంచి టెంపో ట్రావెలర్ వ్యాన్‌ను చోరీ చేసిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. బంగారికి చెందిన వ్యాన్‌ను వైఎస్సార్ జిల్లా చాపాడుకు చెందిన ఎర్ర చందనం దొంగ ఫక్రుద్దీన్ మే ఆఖరులో ఎత్తుకెళ్లాడు. ఈ చోరీ సీసీ కెమెరాలలో రికార్డయింది. అప్పట్లో అతడు ఉపయోగించిన ఇన్నోవా కారు బెంగళూరుకు వచ్చినట్లు పోలీసులకు తెలిసింది. దీంతో ఆ కారు జాడను పసిగట్టి దొంగను తిరుపతిలో అరెస్టు చేసి బుధవారం చిక్కబళ్లాపురం తీసుకువచ్చి స్థల పరిశీలన చేశారు. ఆ వ్యాన్‌ను ఎర్ర చందనం రవాణాకు ఉపయోగించినట్లు ఒప్పుకున్నాడు. ఇతడు బడా దొంగ అని, కర్ణాటక, తెలుగు రాష్ట్రాలలో 72 కేసులుండగా, వాటిలో 70 కేసులు ఎర్ర చందనానివే అని పోలీసులు చెప్పారు. ఇతడు కోట్లాది రూపాయల ఎర్ర చందనం స్మగ్లింగ్ చేస్తుంటాడని తెలిసింది. విచారణలో మరిన్ని దొంగతనాలు బయటపడే అవకాశముంది.

ఎన్.ఈశ్వరరెడ్డికి తుమ్మల సాహితీ పురస్కారం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆచార్యులు డాక్టర్ నల్లపురెడ్డి ఈశ్వరరెడ్డికి తుమ్మల సీతారామయ్య సాహితీ పురస్కారం అందజేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. శివప్రసాద్ తెలిపారు. అభ్యుదయ సాహిత్యంలో కృషిచేసే వారిని గుర్తించి ప్రతి యేటా ఒక రచయితకు పురస్కారం అందజేస్తారు. 2024 సంవత్సరానికి సంబంధించి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డిని పురస్కారానికి ఎంపిక చేశారు. ఈనెల 7వ తేదీ శనివారం గుంటూరులో నిర్వహించనున్న సాహిత్య కార్యక్రమంలో పురస్కారం ప్రదానం చేయనున్నారు. పురస్కార గ్రహీతకు రూ.5వేలు నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువ అందజేయనున్నారు. ఎంఏ తెలుగు, ఎంసీజే (జర్నలిజం) పూర్తి చేసిన ఈయన అవంత్స సోమసుందర్ రచనలపై పీహెచ్‌డీ, ఆధునిక కవిత్వంలో ఉద్యమాలు-ఇజాలు అన్న అంశంపై భారత ప్రభుత్వ ఫెలోషిప్‌తో పరిశోధన పూర్తి చేశారు. 80కిపైగా జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పత్ర సమర్పణలు, 90కిపైగా పరిశోధనా పత్రాలు ప్రచురితమయ్యాయి. కన్నీటి సీమ, రైతన్నా మేలుకో-ఆత్మహత్య మానుకో, మనసుపాట, కవిత-మానవీయత, సాహిత్యం-సమాజం, నాకొక మనిషి కావాలి, తిలక్ సాహిత్యం వంటి రచనలు చేశారు. ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎన్. ఈశ్వరరెడ్డి ఎంపిక కావడం పట్ల పలువురు ఆచార్యులు అభినందనలు తెలిపారు.

కోదండరాముడి స్థలాలకు ఫెన్సింగ్

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయానికి సంబంధించిన స్థలాలను ఫెన్సింగ్ కోసం టీటీడీ అధికారులు చదును చేస్తున్నట్లు టీటీడీ ఏఈ అమరనాథ్ రెడ్డి తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామనగర్ పక్కనే ఉన్న ఎండోమెంట్ స్థలాన్ని టీటీడీ, రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్న క్రమంలో అడ్డుగా ఉన్న ముళ్ల పొదలను జేసీబీ సహాయంతో తొలగించారు. దీని తర్వాత అక్కడ దేవదాయశాఖ స్థలం ఎంత ఉందో సర్వేచేసి ఆ హద్దు వరకు ఫెన్సింగ్ వేయిస్తామని టీటీడీ ఏఈ తెలిపారు. అలాగే రైల్వే కాలనీ వద్ద ఉన్న దేవదాయశాఖ స్థలంలోని ముళ్లపొదలను కూడా తొలగించి చదును చేసి అక్కడ కూడా ఫెన్సింగ్ వేస్తామన్నారు.

ప్రశాంతంగా రైల్వే పోలింగ్

నేడు పోస్టల్ బ్యాలెట్

రెండో రోజు పోలింగ్

పోలింగ్ బూత్	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
నందలూరు	418	331
కడప	374	334
కోడూరు	256	194
ఎర్రగుంట్ల	473	378
కొండాపురం	200	162
ప్రొద్దుటూరు	144	133



ఎర్రగుంట్ల పోలింగ్ బూత్ వద్ద పోలీసుల బందోబస్తు

రాజంపేట : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికలు గురువారం రెండోరోజు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 8 నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ కొనసాగింది. రైల్వేకోడూరు, నందలూరు, కడప, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, కొండాపురంలో పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉద్యోగులు, కార్మికులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రైల్వే రక్షక దళాలు, ప్రభుత్వ రైల్వేపోలీసులు, స్థానిక పోలీసులు పోలింగ్ బూత్‌ల వద్ద బందోబస్తు కొనసాగించారు.

నేడు పోస్టల్ బ్యాలెట్..

కాగా వివిధ రైల్వేస్టేషన్‌లలో ఎన్నికల విధి నిర్వహణలో ఉన్న సిబ్బందితోపాటు రన్నింగ్‌స్టాఫ్, టిక్కెట్ చెకింగ్, రక్షణ విభాగం సిబ్బంది శుక్రవారం ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాల్సి ఉంటుంది.

కూలిన కోట గోడల మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



కోట ముఖద్వారం వద్ద పడిపోయిన గోడను పరిశీలిస్తున్న పురాతత్వ సర్వేక్షణాధికారులు

సిద్దవటం : కోటలో పడిపోయిన గోడల మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పురాతత్వ సర్వేక్షణ డిప్యూటీ సూపరింటెండెంట్ శాంభ శివకుమార్ తెలిపారు. సిద్దవటంలోని మట్లిరాజుల కోటను గురువారం ఆయన అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఇంజినీర్ భానుప్రకాష్‌తో కలిసి పరిశీలించారు. కోట ముఖ ద్వారం వద్ద కూలిన గోడను పరిశీలించి వెంటనే నిర్మాణ పనులను చేపట్టాలని కన్జర్వేషన్ అసిస్టెంట్లు బాలక్రిష్టారెడ్డి తదితరులను ఆదేశించారు.

ఈగల్, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు తిరుపతిలో ఏర్పాటు చేయడం శోచనీయం



మాట్లాడుతున్న కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్ప నాయుడు

కడప అర్బన్ : ఈగల్, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు తిరుపతిలో ఏర్పాటు చేయడం శోచనీయమని కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బొగ్గుల గుర్రప్ప నాయుడు పేర్కొన్నారు. కడప న్యాయవాదుల సంఘం సమావేశం హాలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. కడపలో ఈగల్, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయకపోవడం సబబు కాదన్నారు. డ్రగ్స్, గంజాయి, ఎర్రచందనం కేసుల సంబంధిత కోర్టులు తిరుపతిలో పెట్టడం వలన అక్కడి పవిత్రత దెబ్బతింటుందన్నారు. 7వ తేదీ వరకు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, కార్యదర్శి కెనడీ పాల్గొన్నారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయం తరలింపు తగదు

సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ నేతలు



సమావేశంలో పాల్గొన్న సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ నేతలు

కడప రూరల్ : వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడప నుంచి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం తరలింపు తగదని సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ నేతలు పేర్కొన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ నేతలు జగదీశ్వర్‌రెడ్డి, మహమ్మద్, రఘునాథరెడ్డి, లక్ష్మీరాజా మాట్లాడుతూ ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని 20 ఏళ్ల క్రితం పూర్తి సౌకర్యాలతో కడప నగరంలో 50 సెంట్ల విస్తీర్ణంలో కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించారన్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఒకే రాష్ట్రం - ఒకే గ్రామీణ బ్యాంకు పేరుతో అన్ని గ్రామీణ బ్యాంకులను విలీనం చేస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని మిగతా మూడు గ్రామీణ బ్యాంకుల కంటే, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు తన పరిధిలోని ఐదు జిల్లాలలో గ్రామీణ ప్రాంతాల రైతులకు, చిన్న పెట్టుబడిదారులకు, చిన్న మధ్యతరగతి వ్యాపారస్తులకు అత్యున్నత సేవలు అందించడంలో ముందుందన్నారు. మిగిలిన బ్యాంకుల కంటే అధిక బ్రాంచ్‌లు కలిగి ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమగ్రాభివృద్ధి జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పదే పదే చెబుతున్నారని తెలిపారు. ఆ మేరకు కడపలో ఉన్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని యధావిధిగా కొనసాగించాలని కోరారు.

భవిష్యత్ కార్యాచరణ

ఏపీజీబీ ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగాలే భవిష్యత్ కార్యాచరణ రూపొందించినట్లు వారు పేర్కొన్నారు. ఏపీజీబీ సిబ్బంది సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి వైఎస్సార్, అనంతపురం, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల వ్యాప్తంగా బ్యాంకు ఖాతాదారులను కలిసి పోస్ట్ కార్డ్ క్యాంపెయిన్‌ను చేపడతామన్నారు. కరపత్రాలు పంచడం, పోస్టర్ల విడుదలతోపాటు ప్రజా ప్రతినిధులకు నివేదికలు అందజేస్తామన్నారు. వచ్చే రెండు వారాల్లో కడప, ప్రొద్దుటూరు, బద్వేల్ ప్రాంతాలలో ప్రాంతీయ సదస్సులు, కడప, అనంతపురంలలో జనకవనం పేరుతో సాహితీ కార్యక్రమాలు, అనంతపురం, కదిరిలలో రౌండ్ టేబుల్ సమావేశాలు, విద్యుత్ సిబ్బంది సంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ తదితర కార్యక్రమాలు ఉధృతంగా చేపట్టనున్నామన్నారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నేతలు రాఘవరెడ్డి (న్యాయవాది), అవధానం శ్రీనివాస్ (ఇన్సూరెన్స్), నాగ సుబ్బారెడ్డి (ఏఐటీయూసీ), మనోహర్, రామమోహన్, చంద్ర (సీఐటీయూ), మహేష్ (యూటీఎఫ్), సుధాకర్ (టెలికం), ఓబులేసు, నవీన్ (గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య), దేవర కృష్ణ (లోక్‌సత్తా) పాల్గొన్నారు.